# ట్రైనెట్ న్యూస్

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

https://trinetnews.com/

తాజా తెలుగు వార్తలు

ప్రతి 3 గంటలకు

98497 67747 | 9494184136

4 PM TO 7 PM

సంపుటి: 01 | సంచిక:32 | పేజీలు :02 | వెల:2/రూ | ఎడిటర్: వెంకటేశ్వర్లు రాపోలు | గురువారం, సెప్టెంబర్ 17,2026


**భారత్‌ను ప్రధాని మోదీ గ్లోబల్ పవర్‌గా మార్చారు..**

# ఇజ్రాయెల్ ప్రధాని కితాబు

**ప్రధాని నరేంద్ర మోదీ బలమైన నాయకత్వంలో భారతదేశం 'వరల్డ్ పవర్'గా రూపాంతరం చెందిందని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కొనియాడారు. మోదీ 76వ పుట్టినరోజు సందర్భంగా నెతన్యాహు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.**



ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 17

భారత ప్రధాని నరేంద్ర మోదీ 76వ పుట్టినరోజు (సెప్టెంబర్ 17) సందర్భంగా ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మోదీకి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. సామాజిక మాధ్యమం 'ఎ' ద్వారా ఇరు దేశాల నాయకుల ఫొటోను పంచుకుంటూ నెతన్యాహు కీలక వ్యాఖ్యలు చేశారు. 'గ్లోబల్ పవర్'గా భారతదేశం: ప్రధాని మోదీ బలమైన నాయకత్వంలో భారతదేశం 'వరల్డ్ పవర్'గా రూపాంతరం చెందిందని నెతన్యాహు కొనియాడారు.

## మోదీ జన్మదినం.. రక్తదానం చేసిన ఢిల్లీ సీఎం రేఖా గుప్తా

**తన 14 అవయవాలను దానం చేస్తానని**

# రేఖా గుప్తా ప్రతిజ్ఞ

- అవయవదానాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేక పోర్టల్ ప్రారంభం
- గిగ్ వర్కర్ల కోసం 'నమో శ్రామిక్ సేవా కేంద్రం' ఏర్పాటు
- 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా ఈ కార్యక్రమాల నిర్వహణ



ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 17

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టినరోజు సందర్భంగా ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా వినూత్న సేవా కార్యక్రమాలతో ఆదర్శంగా నిలిచారు. ఆమె స్వయంగా రక్తదానం చేయడంతో పాటు, తన అవయవాలను దానం చేస్తానని ప్రతిజ్ఞ చేశారు. అంతేకాకుండా, గిగ్ వర్కర్ల కోసం ఒక ప్రత్యేక సేవా కేంద్రాన్ని కూడా ప్రారంభించారు. ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రజా సేవను పురస్కరించుకుని చేపట్టిన 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా ఈ కార్యక్రమాలను నిర్వహించారు.వివరాల్లోకి వెళితే, త్యాగరాజ్ స్టేడియంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరంలో సీఎం రేఖా గుప్తా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె రక్తదానం చేశారు. అనంతరం, గుండె, కాలేయం, మూత్రపిండాలు, ఊపిరితిత్తులతో సహా తన 14 అవయవాలను దానం చేయడానికి అంగీకరిస్తూ ప్రతిజ్ఞ చేశారు. అవయవదానంపై ప్రజల్లో అవగాహన పెంచి, దానిని ప్రోత్సహించేందుకు స్టేట్ ఆర్గాన్ అండ్ టిష్యూ ట్రాన్స్‌ప్లాంట్ ఆర్గనైజేషన్ , నేషనల్ ఆర్గాన్ అండ్ టిష్యూ ట్రాన్స్‌ప్లాంట్ ఆర్గనైజేషన్ (చీయూ) సంయుక్తంగా రూపొందించిన అవయవదాన పోర్టల్‌ను ఆమె ప్రారంభించారు.ఈ కార్యక్రమంపై సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో రేఖా గుప్తా స్పందిస్తూ, "ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారి పుట్టినరోజున 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా రక్తదానం చేశాను. ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రజా సేవ, అంకితభావం, దేశ నిర్మాణం స్ఫూర్తితో ఈ కార్యక్రమం చేపట్టాం. రక్తదానం ప్రాణాలను కాపాడటమే కాదు, మానవత్వం పట్ల మన కర్తవ్యాన్ని చాటిచెబుతుంది" అని పేర్కొన్నారు.

**కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై**

# ప్రభుత్వ దృష్టి

**రంగంలోకి రెవెన్యూ అధికారులు**

- కేసీఆర్ ఫామ్‌హౌస్ భూములపై ప్రభుత్వం చర్యలు
- సమీపంలోని ప్రభుత్వ భూములపై రెవెన్యూ అధికారుల ఆరా
- సర్వే నంబర్లు, పాత రికార్డుల సేకరణ
- అసెంబ్లీలో సీఎం రేవంత్ ప్రకటనతో కదలిక



ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 17

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు చెందిన ఫామ్‌హౌస్ భూములపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించింది. సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం సమీపంలో ఉన్న ప్రభుత్వ భూముల వివరాలను రెవెన్యూ అధికారులు సేకరిస్తున్నారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో నివేదికలు సిద్ధం చేస్తున్నారు.ఫామ్‌హౌస్‌కు సమీపంలో ఉన్న ప్రభుత్వ భూముల సర్వే నంబర్లు, గతంలో ఆ భూములను సాగు చేసిన రైతుల పేర్లు, ప్రస్తుత భూ రికార్డుల వివరాలతో అధికారులు సమగ్ర నివేదికలను రూపొందిస్తున్నారు.కేసీఆర్ ఫామ్‌హౌస్ భూములపై విచారణ జరిపిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ ప్రకటనకు అనుగుణంగానే అధికారులు ఇప్పుడు చర్యలు ప్రారంభించారు. ఇందులో భాగంగానే ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంపై దృష్టి పెట్టారు. కేసీఆర్ భూముల విస్తీర్ణం, వాటి స్వరూపంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజకీయ వివాదం కొనసాగుతున్న తరుణంలో ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది.

**2029 ప్రధాని అభ్యర్థిగా విజయ్!**

# తమిళనాట ముదురుతున్న రచ్చ




ఆంధ్రజ్యోతి, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 17:

లోక్‌సభ 2029 ఎన్నికల ప్రధాని అభ్యర్థిత్వంపై తమిళనాట మళ్లీ రచ్చ మొదలైంది. తమిళనాడు కాంగ్రెస్ నేతలు ఈ అంశంపై పరస్పర విరుద్ధ ప్రకటనలు చేయడం, దీనిపై సోషల్ మీడియాలో కామెంట్ల వరకూ విషయం చేరడంతో మరో సారి ఈ అంశం కలకలం రేపింది. తాజాగా తమిళనాడు కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కే సెల్వపెరుంథగై ప్రధాని అభ్యర్థిత్వం మీద కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ మిత్రపక్షాలన్నీ రాహుల్ గాంధీని 2029 ప్రధాని అభ్యర్థిగా స్పష్టంగా ఆమోదించాలని ఆయన డిమాండ్ చేశారు. రాహుల్ నాయకత్వాన్ని అంగీకరించని పార్టీలతో పొత్తు కొనసాగించడంలో అర్థం లేదన్నారు.సెల్వపెరుంథగై వ్యాఖ్యలపై సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ప్రవీణ్ చక్రవర్తి తీవ్రంగా స్పందించారు. సెల్వపెరుంథగైకు కూటమి గురించి మాట్లాడే అధికారిక హోదా లేదని ఎద్దేవా చేశారు. టీవీకేతో తమ సంబంధాలు బలంగా ఉన్నాయని, ఎలాంటి గందరగోళం లేదని చెప్పారు.మొదట ఈ వివాదానికి'ఇండియా టుడే - సీఓటర్' నిర్వహించిన 'మూడ్ ఆఫ్ ది నేషన్' జాతీయ సర్వే ప్రధాన కారణమైంది. ఈ సర్వేలో 2029 ప్రధాని అభ్యర్థిగా నరేంద్ర మోదీ అగ్రస్థానంలో నిలవగా, రాహుల్ గాంధీ 27శాతం మద్దతుతో రెండో స్థానంలో నిలిచారు. ఆశ్చర్యకరంగా తమిళనాడు సీఎం విజయ్‌కు జాతీయ స్థాయిలో 9.2శాతం మద్దతు లభించి ఆయన మూడో స్థానంలో నిలిచారు.సర్వేలో విజయ్‌కి లభించిన పాపులారిటీని చూసి టీవీకే పార్టీ శ్రేణులు, అభిమానులు సోషల్ మీడియాలో క్యాంపెయిన్‌ను విపరీతంగా ట్రెండ్ చేయడం మొదలుపెట్టారు.

**టాటా గ్రూప్ చైర్మన్‌గా**

# మరో ఐదేళ్లపాటు ఎన్. చంద్రశేఖరన్

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 17:




టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా ఎన్. చంద్రశేఖరన్ (63) పదవీకాలాన్ని మరో ఐదేళ్ల పాటు పొడిగిస్తూ బోర్డు ఆమోదం తెలిపింది. ఇవాళ (గురువారం) ముంబైలోని బాంబే హౌస్‌లో జరిగిన టాటా సన్స్ బోర్డు సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.మునుపటి నిర్ణయం ఉపసంహరణ: ఈ ఏడాది ఆగస్టు 12న చంద్రశేఖరన్ తన ప్రస్తుత పదవీకాలం పూర్తి కాగానే మూడోసారి ఛైర్మన్‌గా కొనసాగే ఉద్దేశం లేదని ప్రకటించారు.

**ధారావాహిక సీరియల్‌లా**

# ఇప్పుడు గురుకుల స్కాం ఎపిసోడ్ 2 నడుస్తోంది : ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 17

ఈ తెలంగాణలో విద్యార్థుల జీవితాలు ఎంత ఘోరమైన ప్రమాదంలో పడ్డాయని చెప్పడం కోసం బీఆర్ఎస్ మీ ముందు ఒక లైవ్ డెమో ఇవ్వాలనుకున్నదని బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు.తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. ఒక విద్యార్థి స్కూల్‌కు పోయినప్పుడు గురుకుల పాఠశాల కానీ మామూలు పాఠశాల కానీ పోయినప్పుడు ఆ విద్యార్థి తల్లిదండ్రులు మా బిడ్డ బాగా చదువుకోవాలని మంచి ఆహారం తినాలి.. అంటే కార్బోహైడ్రేట్లు, ప్రోటీన్, విటమిన్లు, కొవ్వులు మా బిడ్డకు చక్కగా దొరకాలి.. దొరుకుతాయి అన్న నమ్మకంతోనే పేదవర్గాలు ఈ బడులకు పంపిస్తారు. కానీ ఈ రోజు రేవంత్ రెడ్డి పాలనలో తెలంగాణలో ఉండే లక్షలాది మంది విద్యార్థుల జీవితాలు ప్రమాదంలో పడ్డాయి. ఈ విషయాన్ని తెలంగాణ ప్రజలకు గత 6 నెలలుగా మేము చెప్తూనే ఉన్నాం. రేవంత్‌రెడ్డి విద్యాశాఖ మంత్రి అయిన తర్వాత, హోంశాఖ మంత్రి అయిన తర్వాత పిల్లల జీవితాలు నిజంగా ప్రమాదంలో పడ్డాయన్నారు.ఐపీఎల్ సీజన్ 1,2, 3 ఎట్లా అయితే ఉంటదో గురుకుల కుంభకోణం కూడా ఒక ధారావాహిక సీరియల్‌లా నడుస్తోందని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. ఇప్పుడు ఎపిసోడ్ 2 నడుస్తోంది.. అదేంటంటే కల్తీ సరుకులు మన పిల్లలకు ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు. సాంఘీక సంక్షేమ, గిరిజన సంక్షేమ, బీసీ సంక్షేమ, మైనార్టీ సంక్షేమ, జనరల్ సంక్షేమ, కేజీబీవీ, మోడల్ స్కూళ్లు, ప్రభుత్వ పాఠశాలల్లో పొద్దున బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్నం అన్నం, రాత్రి డిన్నర్ చేసే లక్షలాది మంది పిల్లల తల్లిదండ్రులారా జాగ్రత్తగా ఉండండి.. మీ పిల్లలకు ఇచ్చే ఆహారం కల్తీ ఆహారం ఉండబోతుందని హెచ్చరించారు.





**బ్రిక్స్ సదస్సుకు హాజరైన ప్రపంచ నేతలు అనారోగ్యం పాలయ్యారా..**

# ఈ ప్రచారంలో నిజమెంత

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 17

ప్రతిష్టాత్మక బ్రిక్స్ సదస్సు 2026ను ఇండియా విజయవంతంగా నిర్వహించిన సంగతి తెలిసిందే. అయితే, ఈ సదస్సుకు హాజరైన వివిధ దేశాధినేతల్లో కొందరు అనారోగ్యం పాలైనట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ప్రచారంపై కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ స్పందించింది. ఈ ప్రచారంలో నిజం లేదని తెలిపింది. ఇదంతా తప్పుదోవ పట్టించే ప్రచారం అని ప్రకటించింది. దినిపై ఫ్యాక్ట్ చెక్ పేరిట సోషల్ మీడియా వేదికగా స్పష్టతనిచ్చింది.సెప్టెంబర్ 12, 13 తేదీల్లో ఢిల్లీలో బ్రిక్స్ సదస్సు జరిగింది. కొందరు నేతలు సెప్టెంబర్ 11నే ఇండియా వచ్చారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసా వంటి నేతలు హాజరయ్యారు. అయితే, ఈ సదస్సు నుంచి తిరిగి వెళ్లిన తర్వాత పలువురు నేతలు అనారోగ్యం పాలయ్యారనే ప్రచారం మొదలైంది. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసా తమ దేశాలు వెళ్లిన తర్వాత ప్రజలకు కనిపించలేదు. అధికారిక కార్యక్రమాల్ని కూడా రద్దు చేసుకున్నారు.



'మోదీ, ట్రంప్ పేర్లనూ ఎందుకు చేర్చకూడదు?'..

## దిశా సాలియన్ మరణం దర్యాప్తుపై

# ఉద్ధవ్ ఠాక్రే

ముంబై: త్రినెట్ న్యూస్, సెప్టెంబర్ 17

దివంగత నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మాజీ మేనేజర్ దిశా సాలియాన్ మరణానికి సంబంధించిన కేసులో తన కుమారుడు ఆదిత్య ఠాక్రే పేరును ఎఫ్ఐఆర్‌లో సీబీఐ చేర్చడంపై శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే స్పందించారు. ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్లను కూడా ఎందుకు చేర్చకూడదు? అని ఆయన ప్రశ్నించారు. గురువారం సంభాజీనగర్‌లో మీడియాతో ఉద్ధవ్ ఠాక్రే మాట్లాడారు. ఈ కేసు రాజకీయ ప్రేరేపితమని ఆరోపించారు. తనకు గానీ, తన కుమారుడికి గానీ ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. 'ఆ ఘటన అత్యంత విషాదకరమైనది. కానీ మమ్మల్ని ఇందులో ఎందుకు లాగుతున్నారు? మాకు దీనితో ఎలాంటి సంబంధం లేదు. ఇది పూర్తిగా రాజకీయ ప్రేరేపితం. రేపు మీ పేర్లను కూడా ఇందులో లాగొచ్చు' అని ఆయన అన్నారు.కాగా, ఈ కేసుతో సంబంధం లేని వారి పేర్లను కూడా ఎఫ్ఆర్ఐలో చేర్చుతున్నారని ఉద్ధవ్ ఠాక్రే విమర్శించారు. అసలు సంబంధం లేని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వంటి వారి పేర్లను కూడా ఇందులో చేర్చే అవకాశం ఉన్నదని ఆయన ఎద్దేవా చేశారు. 'మీరు ప్రధాని మోదీ, ట్రంప్ పేర్లను కూడా ఇందులో ఎందుకు లాగకూడదు?' అని ప్రశ్నించారు. సీబీఐ 'వ్యక్తిత్వ హననానికి' పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.మరోవైపు దిశా సాలియన్ మరణంతో తనకు ఎలాంటి సంబంధం లేదని ఆదిత్య ఠాక్రే కూడా స్పష్టం చేశారు. ఆమెను ఎప్పుడూ కలవలేదని, ఆమె ఎవరో తెలియదని చెప్పారు. దిశా మరణంతో తనను ముడిపెట్టడం 'స్పష్టమైన రాజకీయ, వ్యక్తిగత ఉద్దేశాలు ఉన్న కొందరు వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా, ఆధారాలు లేకుండా చేస్తున్న వ్యక్తిత్వ హనన ప్రయత్నం' అని ఆయన ఆరోపించారు.కాగా, 2020 జూన్ 8న ముంబైలోని ఒక భవనం 14వ అంతస్తు నుంచి పడిపోవడంతో దిశా సాలియన్ మరణించారు. ఆరు రోజుల తర్వాత జూన్ 14న నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ తన ఫ్లాట్‌లో అనుమానాస్పదంగా చనిపోయారు. దిశా సాలియన్ మరణంపై వస్తున్న అనుమానాల నేపథ్యంలో సీబీఐ దర్యాప్తు చేయాలని తాజాగా బాంబే హైకోర్టు ఆదేశించింది. దీంతో ఆదిత్య ఠాక్రేతో పాటు పలువురిపై ఎఫ్ఐఆర్ నమోదైంది.అయితే ఈ కేసును 'రాజకీయ ప్రేరేపితమైనది'గా చిత్రీకరించడంపై దిశా సాలియన్ తండ్రి సతీష్ సాలియన్ న్యాయ పోరాటానికి దిగారు. ఆదిత్య ఠాక్రే, ఎన్సీపీ (ఎస్పీ) నేత, మహారాష్ట్ర మాజీ హోం మంత్రి అనిల్ దేశ్‌ముఖ్ నుంచి రూ.500 కోట్ల నష్టపరిహారం కోరుతూ లీగల్ నోటీస్ పంపారు.



## కేటీఆర్ సిబ్బంది విచారణ: సీసీటీవీ ఫుటేజ్ భద్రపరచండి..

# పోలీసులకు హైకోర్టు ఆదేశం

- పోలీస్ స్టేషన్‌లో తమపై దాడికి యత్నించారని కేటీఆర్ సిబ్బంది ఆరోపణ
- తదుపరి విచారణకు హాజరైనప్పుడు వారికి రక్షణ కల్పించాలని కోర్టు ఆదేశం
- కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వ ఉన్నతాధికారులకు నోటీసులు

త్రినెట్ న్యూస్, సెప్టెంబర్ 17



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పీఏ, పీఆర్వోల విచారణకు సంబంధించిన కీలకమైన సీసీటీవీ ఫుటేజీని భద్రపరచాలని సైఫాబాద్ పోలీసులను తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. సెప్టెంబర్ 14న వారు పోలీస్ స్టేషన్‌కు వచ్చి వెళ్లిన సమయానికి సంబంధించిన ఫుటేజీని భద్రంగా ఉంచాలని జస్టిస్ టి. మాధవి దేవి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు.సెప్టెంబర్ 7న అసెంబ్లీ వద్ద చోటుచేసుకున్న గందరగోళానికి సంబంధించి, సెప్టెంబర్ 14న కేటీఆర్ పర్సనల్ అసిస్టెంట్ కుంభా మహేందర్ రెడ్డి, పీఆర్వో మహేశ్ మాణిక్యలను పోలీసులు విచారణకు పిలిచారు. అయితే, పోలీస్ స్టేషన్‌లో విచారణ జరుగుతున్న సమయంలో ముసుగులు ధరించిన కొందరు వ్యక్తులు తమపై ఆయుధాలతో దాడికి యత్నించారని, ఆ సమయంలో పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారని ఆరోపిస్తూ వారు హైకోర్టును ఆశ్రయించారు.తమను మధ్యాహ్నం 2 గంటల వరకు వేచి ఉండేలా చేశారని, ఆ తర్వాత కొందరు వ్యక్తులు గుంపుగా విచారణ గదిలోకి ప్రవేశించి దుర్భాషలాడారని పిటిషనర్ల తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. దాడి యత్నంపై ఫిర్యాదు చేసేందుకు పోలీసులు నిరాకరించారని కూడా ఆయన పేర్కొన్నారు.అయితే, ఈ ఆరోపణలను హోం శాఖ ప్రభుత్వ న్యాయవాది తోసిపుచ్చారు. ఇవన్నీ పచ్చి అబద్ధాలని ఆయన స్పష్టం చేశారు. ఓ కార్యక్రమానికి డీజే అనుమతి కోసం కొందరు వ్యక్తులు పోలీస్ స్టేషన్‌కు వచ్చారని, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై ఇప్పటికే ఫిర్యాదు నమోదైందని కోర్టుకు వివరించారు.ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం, పిటిషనర్లు తదుపరి విచారణకు హాజరైనప్పుడు వారికి తగిన రక్షణ కల్పించాలని పోలీసులను ఆదేశించింది. ఈ పిటిషన్‌పై రెండు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని హోం సెక్రటరీ, డీజీపీ, హైదరాబాద్ పోలీస్ కమిషనర్, డీసీపీ, ఖైరతాబాద్ ఏసీపీలకు నోటీసులు జారీ చేసింది.

## ఎల్‌నినో ప్రభావంపై ముందస్తు చర్యలు తీసుకోవడంలో

# చంద్రబాబు విఫలం

## : వైఎస్ జగన్



అమరావతి : త్రినెట్ న్యూస్, సెప్టెంబర్ 17

ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించినప్పటికీ చంద్రబాబు ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో విఫలమైందని వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆరోపించారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయం నుంచి గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వైసీపీ నాయకులతో మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలు వర్షపాతం లోటులోనే ఉన్నాయని పేర్కొన్నారు. జూలై, ఆగస్టులో కూడా తీవ్ర వర్షపాతం లోటు కొనసాగినా కరువు కార్యచరణ చేపట్టలేదని విమర్శించారు. సాధారణంగా 76 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు జరగాల్సి ఉండగా 56.4 లక్షల ఎకరాలకే పరిమితమైందని అన్నారు. ప్రభుత్వ మాటలు నమ్మి సాగుచేసిన రైతులు ఎకరాకు రూ.15 వేల నుంచి 20 వేల రూపాయల వరకు నష్టపోయారని వివరించారు.శ్రీశైలం నీటిని సరైన సమయంలో రాయలసీమకు మళ్లించడంలో ప్రభుత్వం విఫలమైందని దుయ్యబట్టారు. పులిచింతల వద్ద తెలంగాణ చేపడుతున్న లిఫ్ట్‌లపై కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. కరువు ప్రభావిత మండలాలను తక్షణమే అధికారికంగా ప్రకటించాలని, రుణాలను రీషెడ్యూల్ చేయాలని డిమాండ్ చేశారు. కరువు ప్రాంతాల్లో ఉపాధి హామీ పనుల కోసం కేంద్రాన్ని వెంటనే అదనపు పనిదినాలు కోరాలని సూచించారు.

## రొమ్ము క్యాన్సర్ చికిత్సలో కీలకమైన మార్పు..

# ఔషధానికి వేగవంతమైన అనుమతి..

రొమ్ము క్యాన్సర్ చికిత్సలో కీలకమైన మార్పుకు అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ అనుమతి ఇచ్చింది. అడ్వాన్స్‌డ్ రొమ్ము క్యాన్సర్ ఉన్న కొంతమంది రోగులకు ఉపయోగించే క్యామిజెస్ట్రాంట్ అనే ఔషధానికి వేగ వంతమైన అనుమతి లభించింది. హార్మోన్ రిసెప్టర్ పాజిటివ్, హెచ్‌ఈఆర్2 నెగెటివ్ స్థానికంగా అభివృద్ధి చెందిన లేదా ఇతర ప్రాంతాలకు వ్యాపించిన రొమ్ము క్యాన్సర్ లో, హార్మోన్ చికిత్సతోపాటు సీడీకే4 లేదా సీడీకే 6 నిరోధక మందులు తీసుకుంటున్న సమయంలో ఈఎస్ఆర్1 జన్యు మార్పు కనిపించిన వారికి ఈ ఔషధాన్ని ఉపయోగించ వచ్చు. ఈ అనుమతి ప్రత్యేకత ఏమిటంటే, స్కాన్లలో క్యాన్సర్ మళ్లీ అభివృద్ధి చెందుతున్నట్లు కనిపించక ముందే రక్త పరీక్ష ద్వారా చికిత్సకు నిరోధకత పెరుగుతోందని గుర్తించి మందును మార్చుకునే అవకాశం కల్పించడం.

త్రినెట్ న్యూస్, సెప్టెంబర్ 17



### ఈస్ట్రోజెన్ ప్రేరణను అడ్డుకునేలా..

క్యామిజెస్ట్రాంట్ నోటి ద్వారా తీసుకునే ఔషధం. ఇది ఈస్ట్రోజెన్ గ్రాహకాలను లక్ష్యంగా చేసుకుని, హార్మోన్ ఆధారిత క్యాన్సర్ కణాల పెరుగుదలకు ఈస్ట్రోజెన్ ఇచ్చే ప్రేరణను అడ్డుకుంటుంది. ఈ ఔషధాన్ని అబెమాసిక్లిబ్, పాల్బోసిక్లిబ్ లేదా రిబోసిక్లిబ్ వంటి సీడీకే4, 6 నిరోధక మందుల్లో ఒకదానితో కలిపి ఉపయోగించేందుకు అనుమతి ఉంది. ఈఎస్ఆర్1 జన్యు మార్పు అనేది అరోమాటేజ్ నిరోధక మందులతో చేసే హార్మోన్ చికిత్సకు క్యాన్సర్ కణాలు నిరోధకతను పెంచుకునే మార్గాల్లో ఒకటి. వ్యాధి మొదట గుర్తించిన సమయంలో ఈ మార్పు చాలా అరుదుగా కనిపించి నప్పటికీ, చికిత్స తర్వాత క్యాన్సర్ పురోగమించినప్పుడు దీని అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని అమెరికా నియంత్రణ సంస్థ పేర్కొంది.

### చికిత్స నిరోధకతను గుర్తించవచ్చు..

ఈ చికిత్సలో రక్త నమూనాలోని ప్రసరణలో ఉండే క్యాన్సర్ కణాల జన్యు పదార్థాన్ని పరీక్షిస్తారు. క్యాన్సర్ కణాలు రక్తంలోకి విడుదల చేసే చిన్న డీఎన్ఏ ముక్కల్లో చికిత్సకు నిరోధకతకు సంబంధించిన జన్యు మార్పులను గుర్తించవచ్చు. మూడో దశ సెరెనా-6 అధ్యయనంలో 315 మంది హార్మోన్ రిసెప్టర్ పాజిటివ్, హెచ్ఈఆర్2 నెగెటివ్ స్థానికంగా అభివృద్ధి చెందిన లేదా వ్యాపించిన రొమ్ము క్యాన్సర్ రోగులను పరిశీలించారు. రక్తంలో ఈఎస్ఆర్1 మార్పు కనిపించినా స్కాన్లలో క్యాన్సర్ పురోగతి కనిపించని సమయంలో కొంతమందికి క్యామిజెస్ట్రాంట్‌తో చికిత్స మార్చారు. ఈ గ్రూపులో క్యాన్సర్ పురోగతి చెందకుండా ఉన్న మధ్యస్థ కాలం 16 నెలలుగా ఉండగా, పాత చికిత్స కొనసాగించిన వారిలో అది 9.2 నెలలుగా నమోదైంది.

### మరిన్ని అధ్యయనాలు అవసరం..

అయితే ఈ ఔషధానికి లభించిన అనుమతి వేగవంతమైన అనుమతి కావడంతో దాని ప్రయోజనాలను నిర్ధారించేందుకు మరిన్ని అధ్యయనాలు అవసరం. ప్రాథమిక ఫలితాలను పరిశీలించే సమయంలో మొత్తం జీవనకాలానికి సంబంధించిన సమాచారం ఇంకా పూర్తిగా అందుబాటులో లేదు. రక్తంలో ప్రసరణలో ఉన్న క్యాన్సర్ కణాల డీఎన్ఏ ద్వారా చికిత్సకు నిరోధకతను స్కాన్లలో మార్పులు కనిపించకముందే గుర్తించి చికిత్స మార్చుకునే విధానానికి ఇది తొలి నియంత్రణ అనుమతిగా పేర్కొన్నారు. అయితే ఈ అనుమతి కొనసాగాలంటే అదనపు అధ్యయనాల ద్వారా ఔషధం అందించే వైద్య ప్రయోజనం నిర్ధారించాల్సి ఉంటుందని పరిశోధకులు తెలియజేస్తున్నారు.

మొదటిపేజీ తరువాయి

## టాటా గ్రూప్ ఛైర్మన్‌గా

# మరో ఐదేళ్లపాటు ఎన్. చంద్రశేఖరన్

అయితే, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా  నిబంధనలు, మారిన పరిస్థితుల దృష్ట్యా నామినేషన్ అండ్ రెమ్యూనరేషన్ కమిటీ  ఆయనను మళ్లీ బాధ్యతలు స్వీకరించాల్సిందిగా కోరింది.నోయెల్ టాటా వ్యతిరేకత: టాటా ట్రస్ట్స్ ఛైర్మన్, టాటా సన్స్ బోర్డు డైరెక్టర్ నోయెల్ టాటా మాత్రమే ఈ పునర్నియామక తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు వేశారు.**ఐపీఓ వివాదం:** టాటా సన్స్ కంపెనీని స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్  చేయడాన్ని నోయెల్ టాటా మొదటి నుంచీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. మరోవైపు, టాటా సన్స్‌లో దాదాపు 18శాతం వాటా కలిగిన షాపూర్జీ పల్లోంజీ గ్రూప్ కంపెనీ లిస్టింగ్‌కు అనుకూలంగా ఉంది.2017 నుంచి టాటా సన్స్ ఛైర్మన్‌గా సేవాలందిస్తున్న చంద్రశేఖరన్ నాయకత్వంలో గ్రూప్ మరింత విస్తరించడంతో, బోర్డు మెజారిటీ సభ్యులు ఆయన వైపే మొగ్గు చూపారు.

మొదటిపేజీ తరువాయి

## ఇజ్రాయెల్

# ప్రధాని కితాబు

భారత్-ఇజ్రాయెల్ రెండు అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాల మధ్య ఇదివరకూ ఎన్నడూ లేని విధంగా బలమైన, అపూర్వమైన భాగస్వామ్యం ఏర్పడిందని చెప్పారు. ఇరు దేశాల మధ్య మైత్రి గతంలో కంటే ఇప్పుడు చాలా బలంగా ఉందని, భవిష్యత్తులో ఈ భాగస్వామ్యాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీకి ఆరోగ్యవంతమైన, సుదీర్ఘమైన నాయకత్వ జీవితం లభించాలని ఇజ్రాయెల్ ప్రధాని ఆకాంక్షించారు.ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో పాటు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇటలీ ప్రధాని జార్జియా మెలోని సహా ప్రపంచవ్యాప్తంగా పలువురు అగ్రనేతలు ప్రధాని మోదీకి జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు.

edited, Printed, Published and Owned by: Venkateshwarlu Rapolu # Flat No. 202, Nomula Chambers, E-Seva Road, TRT Seetaphalmandi, Sec'bad-61.Telangana. INDIA. www.trinetnews.com, Email: trinetnews2026@gmail.com (Telangana) Editor: Venkateshwarlu Rapolu, +91 98497 67747,9494184136